శాంతిభద్రతల పరిరక్షణలో పీస్ కమిటీ సభ్యుల పాత్ర కీలకం



పీస్ కమిటీ సభ్యులతో గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ సైదులు

గోల్కొండ: శాంతిభద్రతల పరిరక్షణలో పీస్ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరిస్తున్న తీరు అభినందనీయమని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. బుధవారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగల సంస్కృతికి నిలయమైన గోల్కొండలో ఏ పండుగ జరిగినా హిందూ ముస్లిం సోదరులు సమష్టిగా విజయవంతం చేస్తున్నారన్నారు. నగరంలో గోల్కొండకు ముఖ్యమైన పాత్ర ఉందన్నారు. బోనాల ఉత్సవాలు గోల్కొండ కోటలోనే ప్రారంభమవుతాయని, అతి పెద్ద ఈద్గాలలో గోల్కొండ కుతుబ్‌షాహీ ఈద్గా ఒకటని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ వేడుకలకు ఎన్నోమార్లు గోల్కొండ కోట వేదికగా నిలిచిందన్నారు. పదేళ్లుగా గోల్కొండ కోటలో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించామన్నారు. స్థానికులు, పీస్ కమిటీ సభ్యులు ఉత్సవాల నిర్వహణలో పోలీసులకు సహకరిస్తున్న తీరు అభినందనీయమన్నారు. మోహర్రం, వినాయక చవితి వేడుకలు, రంజాన్, బక్రీద్ పండుగలు ప్రశాంతంగా జరుపుకుంటూ ప్రజలు మతసామరస్యాన్ని చాటుతున్నారన్నారు. పీస్ కమిటీ సభ్యుల సంఖ్యను మరింత పెంచడానికి తగు సలహాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, పీస్ కమిటీ సభ్యులు అక్బర్ ఆబేద్, నర్సింహులు, మిర్జా ఎక్బాల్ అహ్మద్, చాంద్‌భాయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు మహర్దశ



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడాశాఖకు రూ.465 కోట్లు కేటాయించడం అభినందనీయమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో రాష్ట్రంలో క్రీడా రంగ అభ్యున్నతికి కృషి చేస్తామని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. క్రీడా రంగానికి భారీగా నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం ఎల్బీస్టేడియంలో క్రీడాకారులు, క్రీడాశాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సదుపాయాల కల్పన, క్రీడా మైదానాల నిర్వహణ, కార్యక్రమాల రూపకల్పన వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అసిస్టెంట్ డైరెక్టర్లు కేఆర్‌బి బట్లర్, అశోక్‌కుమార్, కళ్యాణి, పీఆర్‌ఓ పాలేరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పురస్కారాల ప్రదానం



చెక్కులను అందజేస్తున్న రాణి, ముత్తూట్ సంస్థ ప్రతినిధులు

అఫ్జల్‌గంజ్: చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులను ఆదుకోవాలని అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం గ్రంథ పాలకురాలు పీజీవీ రాణి అన్నారు. ముత్తూట్ ఫైనాన్స్ వ్యవస్థాపకులు ఎం.జార్జ్ స్మారకార్థం బుధవారం గ్రంథాలయంలో 8వ, 9వ తరగతుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 50 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులకు రూ.3 వేల చొప్పున నగదు, ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకారాదన్నారు., విద్యార్థులు క్రమశిక్షణ, ప్రతిభతో చదువులో రాణించాలని సూచించారు.

ఆనందోత్సాహాలతో హోలీ మిలన్..



చార్మినార్: నార్‌నూల్ అగర్వాల్ సమితి, హైదరాబాద్–సికింద్రాబాద్ అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పాతబస్తీలోని ఓ హోటల్‌లో హోలీ మిలన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణుల చిత్రపటానికి పూజలు నిర్వహించిన అనంతరం సమితి ప్రతినిధుల కుటుంబ సభ్యులు హోలీ ఆడారు. కార్యక్రమంలో అనూప్ అగర్వాల్, రోహిత్, దేవేందర్ కుమార్, వినోద్ జైన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అగ్రసేన్ మహారాజ్ విగ్రహానికి పూజలు చేశారు.

రంజాన్ వేళ.. మార్కెట్ కళకళ

- కిటకిటలాడుతున్న రంజాన్ స్పెషల్ స్టాల్స్
- ప్రత్యేకంగా వెలిసిన ఫుడ్‌కోర్టులు
- ఆకట్టుకుంటున్న షాదీఖానాలు



అల్ హస్నాత్‌కాలనీ వద్ద రంజాన్ స్టాల్

గోల్కొండ: రంజాన్ మాసంలో సగం ఉపవాస రోజులు ప్రశాంతంగా గడిచిపోయాయి. రంజాన్ పండుగ సమీపిస్తుండటంతో మార్కెట్‌లు కిటకిటలాడుతున్నాయి. మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్ రోడ్డు, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో మార్కెట్‌లు పండుగ కళ సంతరించుకున్నాయి. ఓ వైపు ఫుడ్‌కోర్టులు, మరో వైపు రంజాన్ నేపథ్యంలో వెలిసిన రెడీమెడ్ గిఫ్ట్‌ల షాపులు, ఫ్యాన్సీ ఐటమ్స్ స్టాళ్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి.

- మెహిదీపట్నం నుంచి ఆసిఫ్‌నగర్ రోడ్డులోని అన్ని షాదీఖానాల్లో ప్రత్యేక షాపింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఇందులో అన్ని వయసుల వారికి సంబంధించిన దుస్తులు, ఫుట్‌వేర్‌ను అందుబాటులో ఉంచారు.

చోటా సుల్తాన్‌బజార్‌లో ధగధగలు..

టోలిచౌకీ నుంచి హకీంపేట్ రోడ్డులో ఏటా వెలిసే రంజాన్ బజార్ ఈసారి కొత్త హంగులతో సిద్ధమయ్యింది. చోటా సుల్తాన్‌బజార్‌గా గుర్తింపు పొందిన ఈ మార్కెట్‌లో ఫ్యాన్సీ వస్తువులతో పాటు అన్ని వయస్సుల మహిళలు, పిల్లలు, మగవారికి అన్ని రకాల దుస్తులు అందుబాటులో ఉంటాయి. షేర్వానీ, బ్లేజర్స్ అమ్మే స్టాల్స్ కూడా ప్రత్యేకంగా ఇక్కడ ఏర్పాటు చేశారు.



మెహిదీపట్నం రోడ్డులో ఫుడ్‌కోర్టు

ఆకట్టుకుంటున్న డ్రైఫ్రూట్ స్టాళ్లు..

రంజాన్ పండుగ రోజు అవసరమయ్యే డ్రైఫ్రూట్స్‌ను విక్రయించేందుకు ఇతర రాష్ట్రాల వ్యాపారులు ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఎండు ఖర్జురం, కాజు, బాదామ్, పిస్తాతో పాటు కిస్‌మిస్, చిరోంజి లాంటి డ్రైఫ్రూట్స్ కూడా ఇక్కడ ప్రత్యేకంగా లభ్యమవుతాయి. టోలిచౌకీ చౌరస్తా, మెహిదీపట్నం పాత మెరాజ్ హోటల్ తదితర ప్రాంతాల్లోనూ దుస్తుల కౌంటర్లు వెలిశాయి. బ్రాండెడ్ మిల్లుల షర్ట్, ప్యాంట్ క్లాతింగ్ అతి తక్కువ ధరకే ఇక్కడ లభ్యమవుతున్నాయి.

ఫుడ్‌కోర్టుల వద్ద సందడి

రంజాన్ మాసం వచ్చిందంటే ఆహార ప్రియులకు పట్టరాని సంతోషం కలుగుతుంది. మామూలు రోజుల్లో హోటళ్లలో లభించే వివిధ రకాల నాన్–వెజ్ వంటకాలు రంజాన్ మాసంలో అతి తక్కువ ధరకే లభ్యమవుతాయి. హైదరాబాద్ కబాబ్, మటన్ ఫ్రై, చికెన్ రోస్ట్, గ్రిల్డ్ చికెన్ తదితర హైదరాబాదీ వంటకాలు రంజాన్ ఫుడ్‌కోర్టుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వీటన్నిటికి తోడుగా పత్తర్‌కా గోష్ ఈ ఫుడ్‌కోర్టులలో అదనపు ఆకర్షణగా నిలుస్తోంది. నిజాంకాలనీ, మెహిదీపట్నం చౌరస్తా, ఆసిఫ్‌నగర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఇఫ్తార్ అయిపోగానే ఈ ఫుడ్‌కోర్టులు కిటకిటలాడుతున్నాయి.

మంగళ్‌హాట్‌లో కుళ్లిపోయిన మాంసం స్వాధీనం

12 టన్నుల మాంసం సీజ్



అబిడ్స్: నెలల తరబడి ఫ్రిజ్‌లలో నిల్వచేసిన గొర్రెలు, మేకల మాంసాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాసరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగళ్‌హాట్ ప్రాంతంలోని అమర్‌నగర్ కాలనీకి చెందిన మహ్మద్ అఫ్రోజ్ కొన్నేళ్లుగా కిస్తీచమాన్ దర్గా ప్రాంతంలో ఏ టూ జెడ్ గొర్రెలు, మేకల మాంసం దుకాణం విక్రయిస్తున్నాడు. చెంగిచెర్ల, జియాగూడ ప్రాంతాల నుంచి మేకలు, గొర్రెల మాంసాన్ని తక్కువ ధరకు పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి తన ఇంట్లో ఉన్న ఫ్రిజ్‌లలో నిల్వ చేసి ఫంక్షన్ హాళ్లు, హోటళ్లకు సరఫరా చేస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ సౌత్‌వెస్ట్‌జోన్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ఎస్‌ఐ సాయికిరణ్ ఆధ్వర్యంలో బుధవారం కిస్తీ చమాన్‌లోని దుకాణంతో పాటు అతని ఇల్లు, గోదాములపై దాడి చేసిన పోలీసులు 12 టన్నుల మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. మేకలు, గొర్రెలకు చెందిన లివర్, కిడ్నీ, మెదడు, కాళ్లు తలకాయలు, వాటి విడిభాగాలు పూర్తిగా కుళ్లిపోయాయని పోలీసులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, సీజ్ చేసిన మాంసాన్ని మంగళ్‌హాట్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నాం

అబిడ్స్: విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నామని రిలయన్స్ హైటెక్ స్కూల్స్ విద్యాసంస్థల డైరెక్టర్ జితేందర్ సింగ్ అన్నారు. ధూల్‌పేట్ శివలాల్‌నగర్‌లోని రిలయన్స్ హైటెక్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు బుధవారం ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జితేందర్ సింగ్ మాట్లాడుతూ నర్సరీ నుంచి విద్యార్థులను విద్యతో పాటు వివిధ రంగాల్లో రాణించేలా తమ



ఉపాధ్యాయులు, తమ యాజమాన్యం కృషి చేస్తుందన్నారు. తమ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిషాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

సాహితీ పురస్కారాల ప్రదానం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఎంవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కథారుషి మునిమల్లేరాజు శతజయంతి సందర్భంగా బుధవారం రవీంద్రభారతిలో సాహిత్య సభను నిర్వహించారు.ఈ సందర్భంగా సీనియర్ సంపాదకులు బైస దేవదాస్ మాట్లాడుతూ మునిమల్లే రాజు రచనలు ఎంతో బాగుంటాయన్నారు. ఈ సందర్భంగా రచయిత సుధామ, సినీ రచయిత పి.చంద్రశేఖర్ ఆజాద్‌లకు సాహిత్య పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ కథారచయిత అట్లూరి అనిల్, కవి విహారి, ఆకాశవాణి విశ్రాంత ఉప సంచాలకులు సీఎస్ రాంబాబు, మునిపల్లే రాజు కుమారులు అనిల్ కిషోర్, ఎంవీఆర్ ఫౌండేషన్ సభ్యులు మట్టిగుంట వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మైనార్టీల సంక్షేమానికి నిరంతర కృషి



చార్మినార్: మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ శాఖల సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. బుధవారం చార్మినార్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ ముజీబుల్లా షరీఫ్ ఆధ్వర్యంలో మూసాబౌలిలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..మైనార్టీల సంక్షేమంతో పాటు బీసీ, ఎస్సీ,ఎస్టీ వర్గాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, నాయకులు పులిపాటి రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



చార్మినార్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమ పార్టీ నిరంతరం పని చేస్తుందని మజ్లిస్ బచావ్ తహ్రీఖ్ పార్టీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ అన్నారు. బుధవారం చంచల్‌గూడలోని దారుల్ ఉల్ అమన్ ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మహిళ అదృశ్యం



మహముదా (ఫైల్)

సంతోష్‌నగర్: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దోబీఘాట్ ఈద్గా ప్రాంతానికి చెందిన మహముదా (45) మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఈ నెల 16న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించినా ఫలితం లేకపోయింది. ఆమె సోదరి షేక్ బిక్కాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

శభాష్ యూసుఫ్ ఆలీఖాన్



యూసుఫ్ ఆలీఖాన్‌ను అభినందిస్తున్న జిల్లా విద్యాధికారి రోహిణి

గోల్కొండ: సబ్ జూనియర్ స్థాయి ఫుట్ బాల్ క్రీడలో రాణిస్తున్న గోల్కొండ ఉర్దూ హై స్కూల్ విద్యార్థి యూసుఫ్ ఆలీఖాన్‌ను హైదరాబాద్ జిల్లా విద్యా శాఖ అధికారిణి రోహిణి సన్మానించారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో హైదరాబాద్ జట్టు విజయాని యూసుఫ్ ఆలీఖాన్ విశేషంగా కృషి చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె యూసుఫ్ ఆలీఖాన్‌కు ట్రోఫీతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో యువ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహకులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు విద్యార్థుల్లోని ప్రతిభ, అభిరుచిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



ఉమా మహేందర్‌ను సన్మానిస్తున్న శివశంకర్

జియాగూడ: కార్యకర్తలే పార్టీకి బలమని, బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఇటీవల గోల్కొండ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఉమా మహేందర్ అన్నారు. బుధవారం జియాగూడ డివిజన్ సీనియర్ బీజేపీ నాయకులు, ఓబీసీ మోర్చా మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం శివ శంకర్ ఆధ్వర్యంలో ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఉమామహేందర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు మాణిక్‌ప్రభు, తులసి దాస్, సాయికిరణ్, ఆదోని సుమన్, కళ్యాణి, రాకేష్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

అరుంధతీయ సేవా మండలి రాష్ట్ర అధ్యక్షుడిగా ఈశ్వర్



జి.ఈశ్వర్

గన్‌ఫౌండ్రీ: అరుంధతీయ బంధు సేవా మండలి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా జి.ఈశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్‌లో జరిగిన మండలి జాయింట్ కమిటీ సమావేశంలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. మూడేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ మాదిగజాతి అభివృద్ధి కోసం తమవంతు కృషి చేస్తానని, సేవామండలి కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సేవా మండలి గ్రేటర్ అధ్యక్షుడు బి.నర్సింగ్‌రావు, సెక్రెటరీ జనరల్ జీబీ.సత్యేంద్రకృష్ణ, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సాధ్యం కానిది లేదు



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న జీఎన్‌ఐటీఎస్ వైస్ చైర్ పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి తదితరులు

గోల్కొండ: మహిళలు అన్ని రంగాల్లో విశేషంగా రాణిస్తూ తమలోని నైపుణ్యాన్ని చాటుతున్నారని ఐసీ సెంటర్ హెడ్ ఇన్ఫోసిస్ అధ్యక్షురాలు మనీషా సబు అన్నారు. బుధవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఉమెన్ లీడర్ షిప్ కాన్‌క్లేవ్–2025 కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో తమకు ఎదురు లేదని మహిళలు నిరూపించుకుంటున్నారని, ఇందుకు సునీత విలియమ్స్ నిదర్శనంగా పేర్కొన్నారు. మహిళలలో శక్తిసామర్థ్యాలకు తోడుగా నాయకత్వ లక్షణాలు కూడా మెండుగా ఉంటాయన్నారు. శతాబ్దాలుగా రాజ్యపాలనలో మహిళలు తమ సత్తా చాటుతున్నారన్నారు. సరైన సహకారం, ప్రోత్సాహం లభిస్తే వారు సాధించలేనిది లేదన్నారు. ఉమెన్స్ కాన్‌క్లేవ్‌లాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థినిలు, అధ్యాపకుల మధ్య అవగాహన పెరిగి విద్యార్థినులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ వేదికపై ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఐడియా థాన్, ఫైర్ సైడ్స్ చాట్స్ నిర్వహించారు. కార్యక్రమంలో సాంకేతిక పురోగతి–నిలకడైన భవిష్యత్తు కోసం అనే అంశంపై వివిధ రంగాలకు చెందిన మహిళలు ప్రసంగించారు. కార్యక్రమంలో స్కై రూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకులు నాగభరత్ డాకా, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, డాక్టర్ పి.అపర్ణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: ఇఫ్తార్ విందులు మతసామరస్యాన్ని పొందించేందుకు దోహదపడతాయని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ఈ నెల 22న తాము నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందుకు హాజరుకావాలని కోరుతూ శ్రీ జగదాంబిక మహంకాళీ వృత్తిపని వారల సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి గోల్కొండ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌లకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా తాము గోల్కొండ రిసాలబజార్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ సయ్యద్ ఫయాజ్ మాట్లాడుతూ హిందూ ముస్లిం సోదరుల మధ్య సత్ సంబంధాలు మరింత బలపడాలని ఇఫ్తార్ విందులు ఇందుకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, శ్రీ మహంకాళీ అమ్మవారి ఆలయ పూజారి బి.సురేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సమాజంలో గుర్తింపు



కార్యక్రమంలో పాల్గొన్న పాషా బాయ్, రాజు వస్తాద్ తదితరులు

గోల్కొండ: సేవా కార్యక్రమాలతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని ప్రముఖ సంఘ సేవకుడు, గోల్కొండ పీస్ కమిటీ చైర్మన్ ఎస్.రాజువస్తాద్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ప్రముఖ సంఘ సేవకుడు జీఎంకే గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ పాషాభాయ్‌ను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా రాజు వస్తాద్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలకు పైగా పాషాభాయ్ కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటున్నారన్నారు. గోల్కొండ కోట బోనాల నిర్వహణ, వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలను కాపాడడానికి పాషాభాయ్‌తో స్థానిక ముస్లిం సోదరులు పోలీసులకు సహకరిస్తున్నారన్నారు. పాషాభాయ్ మాట్లాడుతూ యువత ఆదర్శవంతమైన జీవితాన్ని గడపడానికి పెద్దలు వారికి సలహాలు, సూచనలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. సేవా కార్యక్రమాలకు తన అండదండలు ఎప్పుడు ఉంటాయన్నారు. కార్యక్రమంలో నర్సింగ్‌రావు, మహ్మద్ షానవాజ్‌ఖాన్, ఆబేద్, పటేల్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- నగర సీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



దూద్‌బౌలి: దేశంలోనే హైదరాబాద్ నగరానికి ప్రత్యేక గుర్తింపు ఉందని ఆ గుర్తింపును మరింతగా పెంచేందుకు ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఉత్సవాలు జరుపుకోవాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో బుధవారం ఖిల్వత్ చౌమొహల్లా ప్యాలెస్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో హైదరాబాద్ నగర పోలీసులకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రాబోయే రోజుల్లోనూ పోలీస్ అధికారులు మంచి కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలోని ప్రజలు కలిసి మెలిసి ఉత్సవాలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నగరంలో అన్ని వర్గాల ప్రజలు నిర్వహించే ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. నగరంలో శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీజీపీ జితేందర్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, ఎమ్మెల్యేలు మీర్ జుల్ఫికర్ అలీ, జాఫర్ హుస్సేన్ మేరాజ్, అహ్మద్ బలాల, ఎమ్మెల్సీ అఫంది తో పాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామిజీ

గౌలిపురా: గౌలిపురా శ్రీరాంనగర్ కాలనీలోని హంపీ సంస్థానం శ్రీ బాలాజీ, అయ్యప్పస్వామి దేవాలయం 25వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మండపారాధన, అష్టోత్తర (108) కలశస్థాపన, శ్రీ లక్ష్మీగణపతి రుద్ర సకల దేవత హోమం నిర్వహించారు. అనంతరం శ్రీ హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామిజీతో శ్రీ గణపతి సుబ్రహ్మణయ్య స్వామి, అయ్యప్ప స్వాములకు మహా అభిషేకం, మహా పూర్ణాహుతి, పడి హారతి నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితర తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు వి.ఎస్.గణేష్ గురుస్వామి, పొటేల్ సదానంద్ యాదవ్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

యాకుత్‌పురా: రంజాన్ అభివృద్ధి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని రెయిన్ బజార్ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ అధికారులను కోరారు. డివిజన్ పరిధిలోని యాకుత్‌పురా. ఎస్ఆర్టీ కాలనీ, రెయిన్ బజార్ చమన్ ప్రాంతాల్లో కొనసాగుతున్న నిర్మాణ పనులను బుధవారం ఆయన పార్టీ నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... రంజాన్ నేపథ్యంలో ప్రభుత్వం పలు అభివృద్ధి పనులను ప్రతిపాదించిందన్నారు. పనులను రంజాన్‌లోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో మజ్లిస్ సీనియర్ నాయకులు మహ్మద్ వసీముద్దీన్, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, జలమండలి అధికారులు పాల్గొన్నారు.